సాక్షి
విశాఖపట్నం
శనివారం । 22 । జూన్ । 2024



సినిమాతో సమాజానికి మేలు

అక్కయ్యపాలెంలో సినీ తారలు సందడి చేశారు. దర్శకుడు వి.సముద్ర, సంగీత దర్శకుడు డాక్టర్ రవి శంకర్, హీరోయిన్లు అవ్యక్త, హానీబీ ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. 8లో



అతిసారం.. వద్దు నిర్లక్ష్యం

అతిసారం వ్యాప్తి చెందకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. 8లో



మత్తు పదార్థాలతో జీవితాలు దుర్భరం

మత్తు పదార్థాల వినియోగం కారణంగా జీవితాలు దుర్భరమవుతున్నాయని జేసీపీ కె.ఫకీరప్ప పేర్కొన్నారు. 8లో

న్యూస్‌రీల్

30 నుంచి రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: విశాఖపట్నం వేదికగా పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఈ నెల 30వ తేదీ నుంచి 5వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్–జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు పోటీలకు సంబంధించి పోస్టర్‌ను జేసీ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి దివ్యాంగ క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌నకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 70135 69514, 93901 31777 ఫోన్ నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ వై.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, బి.గణేశ్ టి.ఉదయ్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు సీఐలకు పోస్టింగ్‌లు

విశాఖ సిటీ: విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు లభించాయి. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. సిటీ వీఆర్‌లో ఉన్న ఎస్.విద్యాసాగర్‌ను మల్కాపురం లా అండ్ ఆర్డర్‌కు, సీహెచ్.ప్రసాద్‌ను కంచరపాలెం లా అండ్ ఆర్డర్‌కు, పీసీఆర్‌లో అటాచ్‌మెంట్‌లో ఉన్న ఎస్.సన్యాసినాయుడును సీటీసీలో పోస్టింగ్‌లు ఇచ్చారు.

3 బస్సులు, 14 ఆటోలపై కేసుల నమోదు



బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలు, కళాశాలల బస్సులపై రవాణాశాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మూడు బస్సులు, 14 స్కూల్ ఆటోలపై కేసులు నమోదు చేశారు. గంభీరం, వేపగుంట, మద్దిలపాలెం, అడివివరం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇప్పటి వరకు మొత్తం 30 కేసులు నమోదు చేయగా, ఒక బస్సును సీజ్ చేశారు. అలాగే 16 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు మోటారు వాహన తనిఖీ అధికారులు ప్రవీణ్ కుమార్, మాధవి, సత్యంనాయుడు తెలిపారు.

ధరలు నియంత్రించండి

మహారాణిపేట: మార్కెట్లో టమాటా, ఉల్లిపాయలు, ఇతర కూరగాయలు లభ్యతతోపాటు వాటి ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జేసీ మయూర్ అశోక్ అధ్యక్షతన జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వాతావరణ మార్పులు కారణంగా టమాటా ఉత్పత్తి గణనీయంగా తగ్గడంతో ధర పెరిగిందని అధికారులు జేసీకి వివరించారు. తక్కువ ధరకు ఎక్కడ లభ్యమవుతున్నాయో పరిశీలించి అక్కడ నుంచి టమాటా కొనుగోలు చేసి రైతు బజార్లలో విక్రయించాలని జేసీ ఆదేశించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, అన్ని రైతు బజార్లు ఎస్టేట్ అధికారులు, హోల్‌సెల్ మార్కెట్ ట్రేడర్స్ జ్ఞానాపురం,గాజువాక వర్తకులు పాల్గొన్నారు.

జూలో మరో నాలుగు ఆర్వో ప్లాంట్లు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో సందర్శకులకు పడకట్టిన తాగునీరు అందించడానికి కొత్తగా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇంతవరకు ఇక్కడ పలు చోట్ల నాలుగు ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. వాటితో పాటు ఇప్పుడు కొత్తగా మరో నాలుగు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. దివిస్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో ఇక్కడ వాటిని ఏర్పాటు చేస్తున్నట్లు జూ క్యూరేటర్ (ఎఫ్ఏసీ) బి.మంగమ్మ తెలిపారు. వీటిని జిరాఫీ ఎన్‌క్లోజర్, జూలో టి.జంక్షన్, ఆఫ్రికన్ చిలుకలు జోన్, కోతుల జోన్ వద్ద ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ప్లాంట్ కోసం సిమెంట్ దిమ్మలు(ప్లాట్‌ఫారం) నిర్మించారు. వాటి మీద ట్యాంకులు ఏర్పాటు కోసం అవసరమైన మెటీరియల్ సిద్ధం చేశారు.

యోగా మంత్ర



యోగాసనం వేస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ పోర్టు ఆధ్వర్యంలో యోగా విన్యాసాలు



ఎంవీపీలోని జీవీఎంసీ స్పోర్ట్స్ ఎరీనాలో యోగాసనాల్లో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ విశ్వనాథన్, జేసీ మయూర్ అశోక్

యోగా ప్రకృతిని, మనిషిని సంలీనం చేస్తుంది. సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుంది. యోగా ఒక ఆసనం మాత్రమే కాదు.. శాస్త్రీయమైన ప్రక్రియ. యోగా సాధన ప్రకృతితో అనుసంధానం చేస్తూ.. మనల్ని మనం తెలుసుకునేలా చేస్తుంది. యోగా ఆరోగ్యవంతులను చేయడమే కాదు.. మన జీవన విధానంలో గొప్ప మార్పు తెస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ యోగా చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధికారులు యోగాసనాలతో ఆకట్టుకున్నారు.

–సాక్షి, విశాఖపట్నం



యోగాసనాల్లో పాల్గొన్న పోర్టు అధికారులు

లాహిరి.. లాహిరిలో..



దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఉత్సవమూర్తులు



సాగరతీరంలో నౌకలో విహరిస్తున్న శ్రీనివాసుడు

- నయన మనోహరం.. వెంకన్న తిరుకల్యాణం
- ఘనంగా తెప్పోత్సవం

డాబాగార్డెన్స్: నిత్యం పాల కడలిలో పవళించి ముల్లోకాలను బ్రోచే నారాయణుడు వేంకటేశుడై జలధిలో విహరించిన మనోహర దృశ్యం సాగరతీరంలో ఆవిష్కృతమైంది. సాగరానికి చేరువలోని శృంగమణి శిఖరం.. ఆ రమణీయ దృశ్యాన్ని చూసి తరించింది. ఈ దివ్య ఘట్టాన్ని తిలకించి భక్తజనకోటి మురిసింది. పోర్టు ప్రాంతంలోని శృంగమణి పర్వతంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం సాయంత్రం తెప్పోత్సవం నయన మనోహరంగా సాగింది. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన హోమాలు, బలిహరణం, తీర్థగోష్ఠి చేశారు. సాయంత్రం 4 గంటలకు స్వామి వారి ఉత్సవమూర్తులను ముందుగా పల్లకీలో మెట్లమార్గం మీదుగా కిందకు తీసుకొచ్చారు. అనంతరం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, పలువురు ప్రముఖులు స్వామివారి పల్లకిని మేళతాళాలు, అర్చక స్వాముల వేదమంత్రాల నడుమ తెప్పోత్సవానికి సిద్ధంగా ఉన్న నౌక వరకూ మోసుకొచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించిన నౌకపై అధిష్ఠింపజేశారు. భక్తులు ప్రయాణించే లాంచీలు అనుసరించగా.. స్వామి కాసేపు తెప్పపై సాగర విహారం చేశారు. అనంతరం స్వామిని తిరిగి ఆలయానికి తోడ్కెళ్లారు. ఆనందోత్సాహాల నడుమ జరిగిన ఈ తెప్పోత్సవాన్ని చూసి భక్తులు పరవశించిపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, ఆలయ ప్రధానాచార్యుడు శ్రీనివాస జగన్నాథాచార్యులు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారిని పల్లకిలో ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

నేటి కార్యక్రమాలు..

వార్షిక తిరు కల్యాణోత్సవంలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పూర్ణాహుతి, చూర్ణోత్సవం, సముద్ర స్నానం(చక్రస్నానం), సాయంత్రం 6 గంటలకు ఆరాధన చూర్ణోత్సవం(దొంగల దోపు ఉత్సవం), ధ్వజ అవరోహణం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



జిరాఫీ దత్తత

- రూ.1.80 లక్షల చెక్కు అందించిన ఫ్లూయింట్ గ్రిడ్ సంస్థ



జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్ద జూ క్యూరేటర్, ఫ్లూయింట్ గ్రిడ్ సంస్థ ప్రతినిధులు

ఆరిలోవ: అంతర్జాతీయ జిరాఫీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇందిరాగాంధీ జూ పార్కులోని ఓ జిరాఫీని ఫ్లూయింట్ గ్రిడ్ సంస్థ దత్తత తీసుకుంది. సంస్థ డైరెక్టర్ వాణి గన్నమని సూచనలతో సీనియర్ మేనేజర్ రవికాంత్‌రెడ్డి జిరాఫీని ఓ ఏడాది పాటు దత్తతకు రూ.1.80 లక్షల చెక్కును జూ క్యూరేటర్(ఎఫ్ఏసీ) జి.మంగమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా క్యూరేటర్ ఫ్లూయింట్ గ్రిడ్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జూలో వన్యప్రాణుల దత్తత స్వీకార కార్యక్రమం కొనసాగుతోందని, దాతలు ముందుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వన్యప్రాణులు తినే ఆహారం బట్టి వాటి ఖర్చు ఉంటుందన్నారు. జిరాఫీకి ఓ ఏడాదికి రూ.1.80లక్షలు ఖర్చు అవుతుందన్నారు. అరటి పళ్లు, జామ, క్యారెట్, ఉల్లి, ఎర్ర దుంపలు, బత్తాయితో పాటు వేరు శనగ పిండి, బీన్స్, పలు రకాల పప్పులు, పుట్టగొడుగు తదితర వాటిని జిరాఫీకి అందిస్తామన్నారు. ఇవన్నీ కలిపి జిరాఫీ వయసు, అది తినే దాన్ని బట్టి 18 కిలోల నుంచి 20 కిలోల వరకు ఇస్తామన్నారు. వీటితో పాటు మర్రి, తడ తదితర చెట్ల ఆకులను రోజూ ఆహారంగా అందిస్తున్నట్లు వివరించారు. జూ అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషలిస్ట్ వైద్యుల తొలగింపు

మహారాణిపేట: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్పెషలిస్ట్ వైద్యుల తొలగింపునకు రంగం సిద్ధమైంది. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న స్పెషలిస్ట్ వైద్యులను ఈ నెల 30వ తేదీ నుంచి నిలుపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు 29 మంది స్పెషలిస్ట్ వైద్యులకు నోటీసులు జారీ చేశారు. జూలై ఒకటో తేదీ నుంచి ఈ వైద్యుల జీతాల బిల్లులను ప్రాసెస్ చేయవద్దని వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆర్.గణపతి ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ జిల్లాలో 29 మంది వైద్యులు, అనకాపల్లి జిల్లాలో ఐదుగురు వైద్యులను తొలగించనున్నారు.

మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయండి



రక్తదానం చేస్తున్న సీపీ రవిశంకర్

అల్లిపురం: రక్తదానం చేయడం ఎంతో గొప్ప విషయమని, ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్ సూచించారు. నగర పోలీస్ శాఖ సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కమిషనరేట్‌లో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు, కేజీహెచ్ బ్లడ్ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన పాల్గొని ప్రారంభించారు. ఆయనే స్వయంగా రక్తాన్ని దానం చేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. ఆయనతో పాటు 75 మంది సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో జేసీపీ డాక్టర్ కె.ఫకీరప్ప, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ కల్యాణి, డాక్టర్ ఏ.సుగంధి, ఎండీ పెథాలజిస్ట్ డాక్టర్ పద్మజ, డాక్టర్ ఎస్.విజయకుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, నగర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముగిసిన జీఎస్టీ అధికారుల శిక్షణ



జీఎస్టీ అధికారుల హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్, ఏడీ రవికిరణ్

సాక్షి, విశాఖపట్నం : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) ట్రెనింగ్ అకాడమీలో జీఎస్టీ , కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు విశాఖలోని అక్కయ్యపాలెంలోని ట్రెనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా నియమితులైన 48 మంది జీఎస్‌టీ ఇన్‌స్పెక్టర్లతో పాటు ఇతర విభాగాలల అధికారులకు 14 వారాల శిక్షణ ముగింపు కార్యక్రమానికి విశాఖ కస్టమ్స్ అండ్ సెంట్రల్ టాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జీఎస్టీ అధికారుల హ్యాండ్‌బుక్‌ని ఆవిష్కరించిన అనంతరం ట్రెనీ అధికారులకు శిక్షణ పూర్తి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ స్మార్ట్ ఇంటిలిజెన్స్‌తో కేసుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు నాసిన్ అదనపు డైరెక్టర్ రవికిరణ్ ఈదర అభినందనలు తెలిపారు.

త్రిశక్తితో రాక్షస సంహారం



ప్రవచనం చేస్తున్న రమ్యానందభారతీ స్వామి

సీతంపేట: శ్రీలలితా పీఠంలో గురువుల ఆరాధనోత్సవాలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. త్రిశక్తి వైభవం అను అంశంపై శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతీ స్వామిని ప్రవచనం చేశారు. భువనేశ్వరి దేవి తత్వాన్ని, వైభవాన్ని వివరించారు. భువనేశ్వరి మాత నుంచి సరస్వతి, లక్ష్మీ, పార్వతి అవతరించారని తెలిపారు. మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి.. శక్తి త్రయమని, ఈ శక్తుల కలయికతో రాక్షస సంహారం జరిగిందని వివరించారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైద్యుడిపై హత్యాయత్నం

అల్లిపురం: కేజీహెచ్ వైద్యుడిపై హత్యాయత్నం ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మహారాణిపేట సీఐ వి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. కేజీహెచ్‌లో పనిచేస్తున్న జనరల్ ఫిజీషియన్, డాక్టర్ లే (దివ్యాంగుడు) ఉదయం 9.15 గంటలకు నౌరోజీరోడ్డులో తన అపార్ట్‌మెంట్ నుంచి కేజీహెచ్‌కు ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. ఆ సమయంలో అతని మేనమామ పరూష్ గుజారా, అతని కుమారుడు రుచిత్ గుజారాలు కత్తితో దాడికి పాల్పడ్డారు. డాక్టర్ ఎడమ కాలుకు తీవ్ర గాయమైంది. దీంతో అతను మహారాణిపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

81 మందికి ఉద్యోగాలు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్క్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. ఆరు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 210 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 165 మంది అభ్యర్థులు హాజరుకాగా..81 మంది ఎంపికైనట్టు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

మత్తు పదార్థాలతో జీవితాలు దుర్భరం

విశాఖ సిటీ: మత్తు పదార్థాల వినియోగం కారణంగా జీవితాలు దుర్భరమవుతున్నాయని జాయింట్ సీపీ కె.ఫకీరప్ప అన్నారు. డ్రగ్స్ నివారణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శుక్రవారం సిరిపురంలోని డబ్ల్యూఎస్ఎస్‌లోని ఉద్యోగులకు డ్రగ్స్, గంజాయి దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ క్రైం, మహిళలపై నేరాలు, ఇతర అసాంఘిక చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వీడియోల రూపంలో వివరిస్తూ అవగాహన కల్పించారు.

సినిమాతో సమాజానికి మేలు

సీతంపేట: అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాలలో శుక్రవారం సినీ తారలు సందడి చేశారు. నగరంలో షూటింగ్ కోసం వచ్చిన ఓ సినిమా బృందం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించింది. సందేశాత్మక చిత్ర దర్శకుడు వి.సముద్ర, సంగీత దర్శకుడు డాక్టర్ రవి శంకర్, హీరోయిన్లు అవ్యక్త, హసీబీ, గాయకులు రాము, పీయూష్ అంబోర్, శుభప్రదం నిర్మాత తిలక్ పాఠశాలను సందర్శించారు. సమాజంపై సినిమాల ప్రభావం, సినిమా వల్ల కలిగే ప్రయోజనాలను పిల్లలకు వివరించారు. సినిమాలపై అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు చకచకా సమాధానాలిచ్చి ఆశ్చర్యం కలిగించారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ సినిమా కేవలం వినోదం కాదని, సమాజానికి మేలు చేసే దిశగా పనిచేస్తుందన్నారు. వాగ్దేవి ప్రిన్సిపాల్ ఎం.వి.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఎస్.ఎల్.శైలజ, నాయకులు సతివాడ శంకరరావు పాల్గొన్నారు.

ఆలస్యంగా హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: ఎస్ఎంవీ బెంగళూరులో శుక్రవారం ఉదయం 10.15 గంటలకు బయలుదేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు–అగర్తలా (12503)హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు 5 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 3.30గంటలకు బెంగళూరులో బయల్దేరింది. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు ఈ రైలు చేరుకోనుంది. పెయిరింగ్ రైలు ఆలస్యంగా చేరినందున ఈ రైలు ఆలస్యంగా బయల్దేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

ఆరోగ్య విశాఖను నిర్మిద్దాం

- ఎంపీ శ్రీభరత్
- జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాలో అంతర్జాతీయ యోగా దినోత్సవం



పోలీస్ పరేడ్ మైదానంలో యోగాసనాలు వేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది



యోగా ముద్రలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ. చిత్రంలో విశాఖ ఎంపీ శ్రీభరత్

మహారాణిపేట: యోగా విశిష్టత, ప్రాధాన్యతను అందరూ తెలుసుకోవాలని, ఆరోగ్య విశాఖ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎంపీ శ్రీభరత్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎంవీపీకాలనీలోని జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియంలో ఆయుష్ విభాగం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చన్నారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యం, విశిష్టతను వివరించారు. అనంతరం యోగా గురువుల బృందం సహాయంతో నేచురోపతి వైద్యుడు డాక్టర్ టి.తులసీరావు అందరితో యోగాసనాలు వేయించారు. బ్రహ్మకుమారి శివలీల ధ్యానం ప్రాధాన్యతను తెలుపుతూ.. అందరితో ధ్యానం చేయించారు. జీవీఎంసీ కమిషనర్, జేసీ కె.మయూర్ అశోక్, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథం చేతుల మీదుగా యోగా గురువులు, నిర్వాహకులకు జ్ఞాపికలు అందజేశారు. ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఆయుష్ విభాగం అధికారులు, బ్రహ్మ కుమారీలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అల్లిపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు అనునిత్యం ఒత్తిడితో గడుపుతుంటారన్నారు. ఆ ఒత్తిడి నుంచి దూరమవ్వడానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులతో కలిసి ఆయన యోగాసనాలు వేశారు

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి

అల్లిపురం: పోలీసులు మానసిక, శారీరక దృఢత్వం సాధించడానికి యోగా అవసరమని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అన్నారు. సూర్యాభాగ్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో యోగా డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది అందరూ తమ ఆరోగ్యం పట్ల ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే అందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వాటి వివరాలను సిబ్బంది ఫోన్లకు పంపించినట్లు తెలిపారు. జేసీపీ కె.ఫకీరప్ప, డీసీపీ క్రైం వెంకటరత్నం, ఆర్ట్ లివింగ్ సీనియర్ ఫ్యాకల్టీ అరుణ, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

గాదిరాజు ప్యాలెస్‌లో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్–11లోని గాదిరాజు ప్యాలెస్‌లో ఓం ఉచిత యోగా సెంటర్ ఆధ్వర్యంలో యోగా డే వేడుకలు జరిగాయి. ఎంపీ గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు అతిథులుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్ వ్యవస్థాపకుడు చిలక వెంకట రమేష్ అందరితో యోగాసనాలు వేయించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, భానుకుమార్, మధుసూదనరావు పాల్గొన్నారు.

ఎఫ్ఎస్ఐలో..

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్ సమీపంలోని భారతీయ మత్స్య పరిశోధన సంస్థ(ఎఫ్ఎస్ఐ) కార్యాలయ ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. సంస్థ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి, డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ కాలేజీ ఆచార్యులు డాక్టర్ శామ్యూల్ యోగా విశిష్టతను వివరించారు. జీవీఎంసీ మున్సిపల్ హైస్కూల్, రైల్వే న్యూకాలనీ యోగా సెంటర్ ఇన్‌చార్జి బి.టి.ఎస్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. మత్స్యదర్శిని నౌకలో ఉద్యోగులు యోగాసనాలు వేశారు.

భవిత కేంద్రాల్లో..

విశాఖ విద్య: సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది.



2,214 మంది క్యాడెట్లతో యోగా

కొమ్మాది: శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే యోగా ఒక్కటే మార్గమని ఎన్‌సీసీ బెటాలియన్–2 సీటీఆర్ కల్నల్ తపాస్ మండల్ అన్నారు. సాగర్ నగర్ బీచ్ వద్ద 13వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆయన పాల్గొని.. యోగా ప్రాముఖ్యాన్ని వివరించారు. నగరంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన 2,214 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లతో యోగాసనాలు వేయించారు.



మత్స్యదర్శినిలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు



గాదిరాజు ప్యాలెస్‌లో యోగాసనాలు వేయిస్తున్న రమేష్

చైనాలో యోగా

- మధురవాడ వాసి ఆధ్వర్యంలో వేడుకలు



మాస్టర్ వాసం సంతోష్

మధురవాడ: మధురవాడకు చెందిన యోగా గురువు వాసం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం చైనాలోని ఉయాంగ్ సిటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. చైనీయులతో యోగాసనాలు వేయించి యోగా గొప్పతనాన్ని వివరించారు. వాసం సంతోష్‌కుమార్ ఎనిమిదేళ్ల కిందట చైనాలో స్థిరపడ్డారు. అక్కడ సెవన్ చక్రాస్ ఇండియన్ యోగా ఇన్‌స్టిట్యూట్ పేరుతో శిక్షణ కేంద్రం స్థాపించి అంచెలంచెలుగా ఎదిగారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా యోగా అభ్యాసకులతో సూర్య నమస్కారం, వజ్రాసనం తదితర ఆసనాలు వేయించారు.



యోగాసనాలు వేస్తున్న చైనీయులు

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ 10th / INTER / DEGREE ఫెయిల్ అయ్యారా? Don't Worry! Complete in Short period & Join further Studies in 2024-25 Academic Year. Pass Guarantee Guidence. Ph: 90599 10102 [V- 2599]

COURSES

■ ఉచితముగా బ్యూటీషియన్ కోర్సు నేర్పించి సర్టిఫికేట్ ఇవ్వబడును. ఆసక్తి గలవారు ఈ క్రింది నెంబర్లకు ఫోన్ చేయండి. ఫోన్ : 83746 02666, 0891 3137221 [V- 786889]

COACHING CENTRES

■ విద్యాశాఖలో విశేష అనుభవం గల రాష్ట్రోత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత శ్రీమతి S.గౌరీశ్వరమ్మ గారి ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ శిక్షణా కార్యక్రమం 1-7-24 నుండి మహేంద్ర ట్యుటోరియల్స్, వైజాగ్ మధురవాడలో ప్రారంభం. అడ్మిషన్స్ జూన్ 18 నుండి ప్రారంభమైనవి. అడ్మిషన్స్ టైమింగ్స్ : 11 am to 1 pm. హాస్టల్ వసతి కలదు. ఫోన్ : 94412 25296 [V- 2604]

Real Estate

FLAT FOR SALE

■ చినముషిడివాడ వుడా లే-అవుట్ 289 చ॥గ॥ స్థలంలో సెల్లార్ + 2 ఫ్లోర్ కమర్షియల్ 4000 Sft. & 3 rd ఫ్లోర్ 3BHK 2000 Sft. ఫ్లాట్ మొత్తం బిల్డింగ్ అమ్మకం. లోన్ సౌకర్యం. ఫోన్ : 98495 54873, 98498 21992 [V- 0182]

■ East facing flat sale. Daba Gardens RK Store back side, 2nd floor, 850 Sq.ft 15 feet road, Lift facility, 2 scooter parking. © 92466 21131 [B-3689]

HOUSE FOR SALE

■ పెందుర్తి పోలీస్ స్టేషన్ రోడ్‌లో 147 చ॥గ॥ లో సెల్లార్ + 2BHK, W/S, 2 రోడ్డు కార్నర్ (5 Years old) 40 F రోడ్‌తో అమ్మకం : లోన్ సౌకర్యం. ఫోన్ : 94907 95530 [V- 0183]

PLOT FOR SALE

■ Anandhapuram దగ్గరలో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు 200 చ॥గ॥ West facing స్థలాలు అమ్మకమునకు కలవు చ॥గ॥ 9999/- నో మీడియేటర్స్. ఫోన్ : 78937 91597, 95422 17999 [V- 12251]

FLATS FOR SALE
Gated Community, 2 BHK, 1225 Sft. & 1110 Sft., NEW FLATS, Vaisakhi Skyline, Yandada, Vizag with ATTRACTIVE PRICE
8184815118
8520957200

TO-LET

■ Tolet : 3 Floors - 6500 Sft, Lift, Servant Room at Gajuwaka. Suitable for Residential and Semi Commercial. Ph : 94938 26275, 99085 88818 [V- 0176]

■ దొండపర్తి వరుణమోటార్స్ ఎదురుగా కమర్షియల్ ఫ్లోర్ 385 Sft., AC, CC కెమెరా, Laptop మరియు ఆఫీస్ ఫర్నిచర్‌తో సహ అద్దెకు ఇవ్వబడును. ఫోన్ : 81251 50768 [V- 0181]

Services

BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్ పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్&DMA కావలెను. జీతం+కమీషన్. సంప్ర: 8295642391 [H-189669]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12047]

SEPTIC TANK CLEAN

■ విజయ్ సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ హైటెక్ మిషన్‌తో ఇరుగుపొరుగు వారికి ఎలాంటి దుర్వాసన లేకుండా 5 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 93931 55552, 96765 57552 [V-2580]

Wanted

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోమ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15-25 వేలు, మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సాప్ చేయగలరు. 79934 59404. [M-1185224]

www.sakshi.com

చెక్ బుక్స్ పోయినవి

నేను అనగా మరవరం రాజశేఖరం S/o దాలయ్య (లేట్), డోర్ నెం. 22-40-10/1/1, కుంచరపేట, వెంగలరావుపేట, విశాఖపట్నం-530001.లో నివసిస్తున్నాను. నేను మంగళవారం నుండి విశాఖపట్నంకి ట్రైన్‌లో వస్తుండగా నా యొక్క చెక్‌బుక్స్ పోయినవి. 1) Indusind Bank (MVP Branch) చెక్ బుక్ నెం. :197601-197625, 2) కెనరా బ్యాంక్ (దాబాగార్డెన్ బ్రాంచ్) చెక్ బుక్ నెం. 078101-078150, 3) ఫెడరల్ బ్యాంక్ (రామ్ నగర్ బ్రాంచ్) చెక్ బుక్ నెం. : చెక్ బుక్ నెం. 10234011-10234030. వెతికినా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు. ఫోన్ : 90326 11631.

CHANGE OF NAME

I, SIRIKI SANTOSH SAI SRI HARSHA (New Name) S/o SIRIKI SATYANARAYANA, previously called SIRIKI SANTHOSH SAI SRI HARSHA (Old Name) resident of D.No. 9-97/2, Papayyarajupalem, Opp. Petrol Bunk, Sujatha Nagar, Pendurthi, Visakhapatnam - 530051, Andhra Pradesh. Now changed my name from SIRIKI SANTHOSH SAI SRI HARSHA to SIRIKI SANTOSH SAI SRI HARSHA. Henceforth I will be called as SIRIKI SANTOSH SAI SRI HARSHA (New Name) for all purpose.

CHANGE OF NAME

I, BODDIPELLI SRINIVAS (Old Name) S/o. Boddipalli Kondayya, Venkatadri Happy Homes, F.No. 510, Old ITI Junction, Visakhapatnam. I have changed my name as BODDIPALLI SRINIVAS (New Name). Shall henceforth be known called as BODDIPALLI SRINIVAS (New Name)

■ అల్లూరి జిల్లాలో ప్రతి మండలంలో కిసాన్ ప్రాజెక్ట్‌లో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ గా పనిచేయుటకు ఇంటర్, డిగ్రీ చదివినా అభ్యర్థులు కావలెను. జీతం : 18,000/- మీ రెజ్యూమ్ వాట్సాప్‌లో పంపించండి. ఫోన్ : 93477 18940 [V- 791083]

■ Vizagలో 18సం॥ చరిత్ర కలిగిన కంపెనీ Expansion కొరకు 30 సం॥పై బడిన M/F, House wifes, Rtd Person, Customer Relationship Managers కావలెను. Sal+Incen కలదు. ఫోన్: 89781 05690. [V- 12194]

■ Wanted Marketing Executives (M/F), Team Leaders (M/F) for Home Loan sales. Abhi Associates , NAD X Road, Vizag. Ph : 93929 62821 [V- 780440]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం జీ:18K. ఫోన్: 96402 58899 /96404 68899 [H-799894]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతిసారం.. వద్దు నిర్లక్ష్యం

- రెండు నెలల పాటు కార్యక్రమాలు
- కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: అతిసారం వ్యాప్తి చెందకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున తన చాంబర్‌లో సమావేశమయ్యారు. జిల్లాలో అతిసారం వ్యాప్తి చెందకుండా, డెంగ్యూ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు అందజేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లీకవుతున్న, పాడైపోయిన పైప్ లైన్లను తనిఖీ చేయాలన్నారు. వర్షపు నీరు, వాడకం నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలని, దోమలు, క్రిములు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డెంగ్యూ కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఆగస్టు 16వ తేదీ వరకు ప్రత్యేక కార్యాచరణ ద్వారా స్టాప్ డయేరియా పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో డయేరియా, డెంగ్యూ కేసులు నమోదైనట్లయితే సంబంధిత వైద్య శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఎంహెచ్‌వో నరేశ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, డీపీవో శ్రీనివాసరావు, డీఈవో ఎల్.చంద్రకళ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకట చౌదరి, డీఐవో డా. జీవన రాణి, ఐసీడీఎస్ పీడీ జి.జయదేవి పాల్గొన్నారు.

క్షుద్ర పూజలు అవాస్తవం

- ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు

గోపాలపట్నం: విమాన్‌నగర్‌లో క్షుద్ర పూజలు జరిగినట్లు వచ్చిన వార్తలు అవాస్తవమని ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు స్పష్టం చేశారు. స్థానికంగా నివసిస్తున్న బోర రాజేష్ 10 రోజులుగా పెద్ద అరుపులతో పూజలు చేస్తున్నాడన్న ఆరోపణతో గురువారం రాత్రి స్థానికులు అతనిపై దాడులు చేశారు. అతని ఇంటి అద్దాలు పగలగొట్టారు. దీన్ని కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. శుక్రవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు రాజేష్ ఇంటిని తనిఖీ చేశారు. ఎక్కడా క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించకపోవడంతో.. ఎవరో దురుద్దేశపూర్వకంగా ప్రచారం చేసినట్లు గుర్తించారు. ఇక్కడ క్షుద్ర పూజలు జరిగినట్లు వచ్చిన వార్తలు అవాస్తవమని సీఐ తెలిపారు. అయితే స్థానికులు మాట్లాడుతూ రాజేష్ 10 రోజులుగా అర్ధరాత్రి సమయంలో పెద్దగా అరుస్తూ పూజలు చేస్తున్నాడని, అడిగితే తాను అమ్మవారికి పూజలు చేసుకుంటున్నానని చెబుతున్నాడని భయాందోళన వ్యక్తం చేశారు. దీనిపై రాజేష్ మాట్లాడుతూ తన అన్న బోర అప్పరావురెడ్డి ఓ రోడ్డు వివాదంలో తనపై కక్ష పెట్టుకుని ఈ విధంగా దుష్ప్రచారం చేయిస్తున్నాడని ఆరోపించారు. దీనిపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

ప్రత్యేక హోదా సాధనకు ఇదే సరైన సమయం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం: విభజన చట్టం అమలు విషయంలో కూటమి ప్రభుత్వం అంశాల వారీగా స్పష్టమైన వైఖరిని వ్యక్తం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదాను సాధించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపీల మద్దతు లేనిదే మోదీ ప్రభుత్వం మనుగడ సాధించలేని ఈ పరిస్థితి ప్రత్యేక హోదా సాధనకు మంచి అవకాశమన్నారు. అమరావతి అభివృద్ధితో పాటు రాష్ట్రమంతా అభివృద్ధిని విస్తరించాలని కోరారు. పోలవరం పరిస్థితి అగమ్యగోచరంగా మారడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ మోసపూరిత ప్రకటనలే చేస్తోందని మండిపడ్డారు. రుషికొండ భవనాల విషయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడానికి వచ్చే 1, 2, 3 తేదీల్లో మురళీనగర్‌లో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశాలకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణతో పాటు పలువురు జాతీయ స్థాయి నాయకులు పాల్గొంటారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు అచ్యుతరావు, కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్.కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, సీఎస్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

కబళించిన మృత్యువు

- లారీ ఢీకొని బాలుడి మృతి
- తండ్రితో కలిసి మార్కెట్‌కు వెళ్తుండగా ఘటన



సనపల తరుణ్(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: మార్కెట్‌కు సరదాగా ద్విచక్ర వాహనంపై వెళ్లిన ఓ తండ్రీ కొడుకులకు లారీ రూపంలో మృత్యువు ఎదురొచ్చింది. పనులు ముగించుకుని కొద్ది సేపట్లో ఇంటికి చేరుతారనగా.. లారీ ఢీకొని కుమారుడు మృతి చెందడంతో ఆ తండ్రి గుండెలవిసేలా రోదించడం అక్కడి వారిని కలచివేసింది. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక శ్రీనగర్‌లోని దుర్గానగర్‌కు చెందిన సనపల అప్పలనాయుడు, సహస్ర దంపతులు భవన నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి వినయ్ కృష్ణ, తరుణ్(10) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. తరుణ్ గాజువాకలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం అప్పలనాయుడు తన పెద్ద కుమారుడు తరుణ్‌ను తీసుకొని ద్విచక్ర వాహనంపై గాజువాక మార్కెట్‌కు వెళ్లారు. మార్కెట్ పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో సరిగ్గా ఆర్‌కే హాస్పటల్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి వారి ద్విచక్ర వాహనాన్ని వెనక నుంచి వచ్చిన ఓ లారీ ఢీకొట్టింది. దీంతో బైక్ అదుపు తప్పడంతో వెనక కూర్చున్న తరుణ్ తూలి లారీ ముందు పడిపోయాడు. లారీ బాలుడి తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని లారీని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ కోటేశ్వరరావు తెలిపారు.

సుస్థిర ఆర్థికాభివృద్ధికి పాటుపడదాం

- ఎంపీ శ్రీభరత్



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

కొమ్మాది: సుస్థిర ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసే బాధ్యత ప్రపంచ దేశాలు తీసుకోవాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఆధ్వర్యంలో రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. పర్యావరణ, సామాజిక పాలన సూత్రాలను సమర్థవంతంగా అమలు చేయడానికి సంస్థాగత మద్దతు అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆయా సంస్థలు పరిశోధనలు నిర్వహించి ప్రభుత్వాలు అమలు చేసే విధానం రూపొందించాలన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచలోనే ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. 2070 నాటికి భారత దేశం నికర సున్నా (నెట్ 0) ఉద్గారాలను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని, దీంతో శిలాజ ఇంధనంపై ఆధారపడటం తగ్గుతుందన్నారు. ఎల్పీజీ స్టేషన్లను విస్తరించాల్సి ఉందని, గుంటూరు, విశాఖపట్నంలో గ్యాస్ కంపెనీ నెట్‌వర్క్‌లను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాల్లో సీజీడీ(సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్) వ్యాపారంలో రూ.4300 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఐవోసీఎల్ సిద్ధంగా ఉందన్నారు. సీఐఐ ఏపీ చైర్మన్ డా.మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కంచరపాలెం: విశాఖ, అనకాపల్లి జిల్లాల పరిధిలో 11 గురుకులాల్లో (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం) నాలుగు బాలురు, ఏడు బాలికలు పాఠశాలలకు సంబంధించి 2024-25 విద్యా సంవత్సరానికి 6,7,8,9వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయాధికారి రూపవతి తెలిపారు. ఈ మేరకు కంచరపాలెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. దరఖాస్తుతో ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం జత చేసి ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు సమర్పించాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 28వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని ఆమె కోరారు. మిగిలిన వివరాలకు జిల్లా హెల్ప్‌లైన్ నంబర్ 0891-2799641కు సంప్రదించాలన్నాలని సూచించారు.